



సండూరు ప్రచార సభలో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

శిగ్గావి కోట ఎవరిదో..?



భరత్ బొమ్మై



● వారసుడిని గెలిపించేందుకు బొమ్మై పోరాటం ● పఠాన్ కోసం మంత్రివర్గమంతా మకాం



బెంగళూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హావేరి జిల్లా శిగ్గావి కోటలో పాగా ఎవరిదనేది కుతూహలం నెలకొంది. గడిచిన నాలుగు శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి కంచుకోటగా కొనసాగింది. దీనినే సుస్థిరం చేసుకోవాలని బీజేపీ భావిస్తోంది. అయితే 30ఏళ్లుగా గెలుపును చవిచూడని కాంగ్రెస్ ఎలాగైనా ఇక్కడ పాగా వేయాలని కంకణం కట్టుకుంది.

1957 నుంచి 1994వరకు కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ తిరుగులేని పాలన కొనసాగించింది. ఆ తర్వాత హస్తం గట్టెక్కలేకపోయింది. 2023 శాసన సభ ఎన్నికల్లో అప్పటి సీఎం బసవరాజ్ బొమ్మై బీజేపీ అభ్యర్థి కాగా కాంగ్రెస్ నుంచి యాసిర్ అహ్మద్‌ఖాన్ పఠాన్, జేడీఎస్ నుంచి శశిధర యలిగార పోటీ చేశారు. 55శాతం ఓట్లతో బొమ్మై సునాయాసంగా గెలుపు సాధించారు. మారిన రాజకీయ సమీకరణలతో బసవరాజ్ బొమ్మై హావేరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని అధిష్ఠానం ఆదేశించడంతో బరిలోకి దిగి గెలుపొందారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ నుంచి 2023లో ఓటమి చెందిన యాసిర్ అహ్మద్‌ఖాన్‌కు మరోసారి టిక్కెట్ వరించింది. అయితే మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అజ్జంపీర్ ఖాద్రి నామినేషన్ వేయడంతో బీజేపీలో గెలుపు మాదేనని ఉత్సాహం చూపారు. అయితే అజ్జంపీర్‌ను సీఎం, డీసీఎంలు బుజ్జగించి నామినేషన్ ఉపసంహరింపజేశారు. దీంతో కాంగ్రెస్‌కు మరింత ఊపు వచ్చినట్లయ్యింది. వరుసగా శిగ్గావి నుంచి గెలుపొందుతూ వచ్చిన బసవరాజ్ బొమ్మై ప్రస్తుతం కుమారుడు భరత్ బొమ్మైను బరిలోకి దించారు. బొమ్మై చేపట్టిన అభివృద్ధితోపాటు సొంత నియోజకవర్గంపై ఆయనకున్న పట్టు గెలిపిస్తుందనే విశ్వాసంతో బీజేపీ నేతలు ఉన్నారు. ఉప ఎన్నికల్లో 57 మంది బీజేపీ టిక్కెట్‌ను ఆశించారు. కానీ బసవరాజ్ బొమ్మై నిర్ణయానికి ఇటు రాష్ట్రనేతలు, అటు అధిష్ఠానం కూడా మద్దతు పలికింది. దీంతో భరత్‌కు టిక్కెట్ వరించింది.

తారస్థాయికి ప్రచారం

ఉప ఎన్నికలు జరుగుతున్న మూడు చోట్ల ప్రచారం జోరుగానే సాగుతోంది. కానీ మూడు దశాబ్దాలుగా ఓటమితోనే కొనసాగిన శిగ్గావిలో కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ఖాతా తెరవాలని పట్టుదలతో ఉంది. అందుకు అనుగుణంగానే స్వయంగా సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ గ్రామస్థాయిలో సైతం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివానంద పాటిల్, మంత్రులు సతీశ్‌జార్కిహొళి, లక్ష్మీ హెబ్బాళ్కర్, జమీర్ అహ్మద్‌తోపాటు పలువురు అక్కడే మకాం వేసి బూత్ స్థాయిలో రాజకీయాలు చేస్తున్నారు.

నియోజకవర్గ పూర్వాపరాలు

1957లో సవనూరు తాలూకాతో కలిపి శిగ్గావి శాసనసభా స్థానం ఏర్పడింది. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన ఆర్‌సీ పాటిల్ విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్‌కు చెందిన ఎఫ్ఎస్ తావరె గెలుపొందగా 1967లో మాజీ ముఖ్యమంత్రి ఎస్ నిజలింగప్ప కాంగ్రెస్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1972 నుంచి 1983 వరకు నాలుగుసార్లు కాంగ్రెస్ నుంచి ఎంకెఎం నదాబ్ గెలుపొందారు. 1989, 1994లలో కాంగ్రెస్ నుంచి ఎంసీ కున్నూరు గెలుపు సాధించారు. 1999లో జేడీఎస్ నుంచి సయ్యద్ అజ్జంపీర్ ఖాద్రి గెలుపొందారు. 2008 నుంచి 2023 వరకు బసవరాజ్ బొమ్మై నాలుగుసార్లు విజయం సాధించారు. 1985లో ఎన్‌వీ పాటిల్, 2004లో రాజశేఖర్ సింధూర ఇండిపెండెంట్‌లుగా గెలుపొందారు.

ప్రభావిత అంశాలు

ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ - జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా భరత్ బొమ్మై బరిలో ఉండగా అజ్జంపీర్ నామినేషన్ ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్ నుంచి యాసిర్ అహ్మద్‌ఖాన్ పఠాన్ బరిలో ఉన్నారు. భరత్ బొమ్మై 35ఏళ్ల వ్యక్తి కాగా అమెరికాలోని పడ్ర్యూ యూనివర్సిటీలో డిగ్రీ, సింగపూర్‌లో మేనేజిమెంట్ పీజీ చేశారు. బెంగళూరు శివారులోని దొడ్డబళ్ళాపుర పారిశ్రామికవాడలో ఒక ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్‌కు చెందిన యాసిర్ అహ్మద్‌ఖాన్ పఠాన్ 43ఏళ్ల వ్యక్తి కాగా బీఏ పూర్తి చేశారు. అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో రాణించారు. వ్యాపారవేత్తగాను, హావేరి జిల్లా పంచాయతీ సభ్యుడిగాను వ్యవహరించారు.



యాసిర్ అహ్మద్ పఠాన్

రైతుల భూములు వక్ఫ్ బోర్డు ఆస్తులుగా మార్చారనే అంశాన్ని బీజేపీ ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకుంటోంది. ముడా, వాల్మీకి కార్పొరేషన్‌ల అవినీతి అంశం కూడా ప్రచారానికి వాడుతోంది. అయితే గతంలో బసవరాజ్ బొమ్మై వక్ఫ్ ఆస్తులు అల్లా ఆస్తులని, వాటిని కాపాడుకోవాలనే ఓ వీడియోను కాంగ్రెస్ వైరల్ చేసింది. ఆరంభంలో భరత్ బొమ్మైకు టిక్కెట్ ఇవ్వడాన్ని పార్టీలో కొందరు వ్యతిరేకించారు. అయితే ఇటీవల సర్దుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తరపున సీఎం డీసీఎం ప్రచారం చేయడం, ఐదు గ్యారెంటీలు కోట్లాదిమందికి ఆర్థిక చేయూత ఇస్తోందనే ప్రధాన అస్త్రంగా వాడుతున్నారు. బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్న నియోజకవర్గంలో అభివృద్ధి చేయలేదని, పరిశ్రమలు తీసుకురాలేదనే అంశం కాంగ్రెస్‌కు ప్రచారస్త్రంగా మారింది.

ఓటర్ల వివరాలు

శిగ్గావి నియోజకవర్గంలో 2,36,790మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,21,067, మహిళలు 1,15,717 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. 2023 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బసవరాజ్ బొమ్మైకు 1,00,016 ఓట్లు (55శాతం), కాంగ్రెస్ అభ్యర్థి యాసిర్ అహ్మద్‌ఖాన్ పఠాన్‌కు 64,038 ఓట్లు (35)శాతం, జేడీఎస్‌కు చెందిన శశిధర యలిగార 13,928 (8శాతం) ఓట్లు దక్కాయి.

మూడున్నరేళ్లు నేనే సీఎం..!

● సండూరు అభివృద్ధి బాధ్యత నాదే
● ఉప ఎన్నికల ప్రచారంలో సీఎం సిద్దరామయ్య

బళ్లారి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంకా మూడున్నరేళ్లు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా.. సండూరు అభివృద్ధికి నిధులిస్తా..ఆ బాధ్యత నాదే కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణను భారీ మెజార్టీతో గెలిపించండి.. అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య సండూరు ఓటర్లను కోరారు. సీఎం మూడో రోజు పర్యటనలో భాగంగా శనివారం మెట్రికి, డి. అంతాపురం తదితర గ్రామాల్లో పర్యటించారు. సండూరు నియోజకవర్గంలో తుకారాం పలు అభివృద్ధి పనులు చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోనే సండూరు అభివృద్ధి సాధ్యమయ్యిందన్నారు. బిజేపీ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. వారు చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎంపీగా తుకారాం, సీఎంగా నేను అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. సీఎం తోపాటు మంత్రి సంతోష్ లాడ్, మునియప్ప, మాజీ మంత్రి బి. నాగేంద్ర, కాంగ్రెస్ నాయకులు బుడా అధ్యక్షుడు ఆంజనేయులు, డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, మాజీ అధ్యక్షుడు రఫీక్, కాంద్రా సతీష్, వెంకటేశ్ హెగ్డే, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కరోనా మందుల్లో రూ.2 వేల కోట్ల కుంభకోణం

కరోనా కాలంలో అప్పటి అధికార పార్టీ రూ.2 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందని సీఎం సిద్దరామయ్య ఆరోపించారు. శనివారం సాయంత్రం జిందాల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆరోగ్యపరికరాల కొనుగోళ్లలో మితిమీరిన అవినీతి జరిగిందన్నారు. దీనిపై విచారణకు విశ్రాంత న్యాయమూర్తి మైఖేల్ కున్హా నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. కొవిడ్-19 కాలంలో నాడు పాలనలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రూ. 2 వేల కోట్లకు పైగా అవకతవకలకు పాల్పడిందన్నారు. అప్పుడు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న శ్రీరాములు, సుధాకర్, ముఖ్యమంత్రి వీటికి బాధ్యులని ఆరోపించారు. కొవిడ్ తో ప్రజలు చనిపోతుంటే వారి ప్రాణాలు రక్షించడం పోయి బీజేపీ నాయకులు డబ్బులు పోగేసుకునేందుకు సిద్ధమవడం బాధాకరమన్నారు. యడియూరప్ప అబద్ధాల పితామహుడని ఆరోపించారు. కొవిడ్ కాలంలోనే తాను ప్రతిపక్ష నాయకుడుగా ప్రభుత్వాన్ని ప్రశ్నించానన్నారు. తాను అంతరాత్మ ప్రకారం నడుచుకునే వ్యక్తినని, తాను ఏ తప్పు చేయలేదన్నారు. ముడా స్థలాల వివాదంపై బీజేపీ కావాలనే రాద్ధాంతం చేస్తోందన్నారు. చేస్తుందన్నారు. సండూరులో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. రాష్ట్రంలో గ్యారెంటీలతో పేదల బతుకులను మార్చే సత్తా కాంగ్రెస్‌కే ఉందన్నారు. బీజేపీ మాటలు నమ్మే దుస్థితిలో ప్రజలు లేరన్నారు.

టార్గెట్ సండూరు..!

● ఉపపోరులో సత్తా చాటేందుకు కమలనాథుల వ్యూహం
● రాష్ట్ర నేతలతో బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి సుదీర్ఘ చర్చలు

బళ్లారి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల్లో విజయానికి బీజేపీ కంకణం కట్టుకుంది. ఎలాగైనా విజయపతాకం ఎగురవేయాలని వ్యూహాలు పన్నుతోంది. బీజేపీ జాతీయ నాయకులు రంగంలోకి దిగారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పార్టీ ఇన్‌చార్జ్, బీజేపీ జాతీయ కో- ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, గంగావతి ఎమ్మెల్యే సండూరు బీజేపీ పార్టీ ఇన్‌చార్జి గాలి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి బైరతి బసవరాజ్, ఎమ్మెల్యే సునీల్ కుమార్, బీజేపీ జనరల్ సెక్రెటరీ నవీన్, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, కే.ఎస్ దివాకర్, ఎమ్మెల్సీ వై.ఎం సతీష్ లతో పాటు స్థానిక బీజేపీ నేతలతో ఆయన చర్చించారు. ఈ నెల 13న పోలింగ్ జరుగుతుంది. ఓటింగ్ శాతం పెంచడం, అధికార కాంగ్రెస్ అధికారులతో చేస్తున్న దౌర్జన్యం అడుకోవడం పై చర్చలు సాగించారు. ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి తన వ్యూహాన్ని అమలు చేయడాన్ని వివరించినట్లు సమాచారం. కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమణ్ణ ఇక్కడే ఉన్నారు. పోలింగ్‌లో అవాంతరాలను వ్యూహాత్మకంగా ఎదుర్కొవడంపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికలకు గడువు మూడు రోజులే ఉండడంతో కాంగ్రెస్, బీజేపీ నేతలు వ్యూహాలకు పదును పెడుతున్నారు.



ఎన్నికల వ్యూహాన్ని పొంగులేటికి వివరిస్తున్న గాలి జనార్దన్ రెడ్డి

ఓటమి భయంతోనే గల్లీ గల్లీకి సీఎం

ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి సిద్దరామయ్య గ్రామాల్లో గల్లీ గల్లీ తిరుగుతున్నారని, ఒక ముఖ్యమంత్రి మూడు రోజులు ఒకే నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఉండడం చూస్తుంటే ఆయనకు ఓటమి భయం మొదలయ్యిందని స్పష్టమవుతోందని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల బీజేపీ ఇన్‌చార్జ్, బీజేపీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి విమర్శించారు. సండూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మూడు నియోజకవర్గాల్లో బీజేపీ కూటమి గెలుపు ఖాయమన్నారు. సీఎం హోదాలో ఊరూరా తిరగడం చూస్తుంటే కాంగ్రెస్ పరిస్థితి అర్థమవుతోందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సీఎం, కాంగ్రెస్ అధిష్ఠానం విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తోందని ఆరోపించారు. తుకారాం నాలుగు సార్లు గెలిచినా ప్రజలకు, నియోజక వర్గానికి ఒరిగిందేమీ లేదన్నారు.



చిత్రదుర్గలోని నిజలింగప్ప నివాసం

మహనీయున్ని మరిచారు..!

● అమ్మకానికి నిజలింగప్ప నివాసం
● నవకర్ణాటక నిర్మాత గృహంపై ప్రభుత్వం నిర్లక్ష్యం
● భారీ ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటులో ఆయనదే కీలక పాత్ర
● సర్కార్‌పై విమర్శల వెల్లువ

బెంగళూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆధునిక కర్ణాటక నిర్మాణంలో కీలకభూమిక పోషించిన మాజీ ముఖ్యమంత్రి, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షులు నిజలింగప్ప నివాసం విక్రయానికి సిద్ధమైంది. భాషాప్రయుక్త రాష్ట్రాల విభజన తర్వాత సమైక్య కర్ణాటక ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రిగా నిజలింగప్ప వ్యవహరించారు. రెండు పర్యాయాలు ఆయన సీఎంగా కొనసాగారు. నవకర్ణాటక నిర్మాణంలో కీలకభూమిక నిజలింగప్పదే అనే పేరు నేటికీ కొనసాగుతోంది. భారీ సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటు ద్వారా రాష్ట్ర అభివృద్ధికి ఆయన బాటలు వేశారు. నిరాడంబరం, సరళ వ్యక్తిత్వం కల్గినవారుగా నిజలింగప్పకు పేరుంది. సీఎంగా అత్యంత దక్షతతో పాలన సాగించారని నేటికీ చర్చించుకుంటున్నారు. రెండుసార్లు ముఖ్యమంత్రి కావడమే కాక సమైక్య కర్ణాటక పోరాటంలోనూ కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రంకోసం జీవితాన్ని త్యాగం చేశారు. అంతటి మహోన్నతవ్యక్తి నివసించిన ఇంటికి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. దశాబ్దాలకాలంగా నిజలింగప్ప నివాసంపై పలు చర్చలు సాగినా ఎటువంటి ఆచరణ సాధ్యం కాలేదు. చిత్రదుర్గ నగరంలోని ఆయన నివాసం విక్రయానికి సిద్ధమైంది.



నిజలింగప్ప

నిజలింగప్ప నివాసాన్ని స్మారకంగా మార్చాలని పలు ప్రయత్నాలు చేసినా ప్రముఖ నాయకుడు, రచయిత మోహన్ కొండజ్జి తన ఫేస్‌బుక్‌లో ఇల్లు విక్రయానికి ఉందనే విషయాన్ని పంచుకున్నారు. ఇంటి ఫోటోతోపాటు విక్రయానికి సంబంధించిన సమాచారాన్ని పొందుపరిచారు. చిత్రదుర్గలో జిల్లా అధికారి బంగళా సమీపాన ఉండే చారిత్రాత్మక కట్టడమైన మాజీ సీఎం, ఏఐసీసీ మాజీ చైర్మన్ నిజలింగప్ప నివాసం విక్రయానికి ఉందని మార్కెట్ ధర రూ.10కోట్లుగా ఉందని ఆసక్తి కల్గిన వారు కిరణశంకర్‌ను సంప్రదించాలని పోస్టింగ్‌లో పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో ఈ పోస్ట్‌పై ప్రముఖ పాత్రికేయుడు జగదీశ్‌కొప్ప స్పందించారు. మోహన్‌కొండజ్జి షేర్ చేసిన పోస్టింగ్ సమాజంలో నైతిక దివాళాతనానికి నిదర్శనమైందని పేర్కొన్నారు. తమిళనాడులో మాజీ సీఎంలే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడిన కామరాజనాడార్ నివాసాన్ని స్మారకంగా మార్చారని, కానీ రాష్ట్రంలో నిజలింగప్ప, దేవరాజ్ అరసు వంటి వారి నివాసాలను రక్షించి స్మారకాలుగా మార్చే నైతికతకు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

● అబద్ధాలతో మోసం చేస్తున్న సిద్దూ
: మాజీ సీఎం యడియూరప్ప

బళ్లారి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇది దరిద్ర కాంగ్రెస్.. ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదు. పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. సండూరు ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుని గెలిపించండి. బీజేపీ అభ్యర్థి గెలిస్తే రాష్ట్రంలో బీజేపీ ఏమీ అధికారంలోకి రాదు. కానీ కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పిన వాళ్లు అవుతారు ...బంగారు హనుమంతను గెలిపించండి అని మాజీ సీఎం యడియూరప్ప ప్రజలను కోరారు. ఉప ఎన్నికల మూడో రోజు ప్రచారంలో భాగంగా శనివారం తారానగర్, బన్నిహట్టి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. బీజేపీ పాలనతో రైతులు, కార్మికులు, మహిళలు, యువకులకు, రైతులకు అనేక పథకాలు ప్రవేశపెట్టి రుణాలు అందించి లబ్ధి చేకూర్చామన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యవి అన్నీ అబద్ధాలేనన్నారు. సండూరు ఉప ఎన్నికలు కాంగ్రెస్‌కు ఒక గుణ పాఠం కావాలని, కుటుంబ రాజకీయాలతో అభివృద్ధి కుంటు పడిందన్నారు. కొత్త అభ్యర్థి బంగారు హనుమంత ను గెలిపిస్తే కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి సండూరును అభివృద్ధి చేస్తామన్నారు. గనుల ద్వారా వేలకోట్ల ఆదాయం ఉన్నా సండూరు అభివృద్ధిపై కాంగ్రెస్ ఆసక్తి లేదన్నారు. సిద్దరామయ్య ముడా లో అక్రమాలు, ప్రభుత్వ అధికారుల నియామకంలో లంచాలు, ఎస్టీ నిగమ మండలిలో అక్రమాలకు పాల్పడి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. గాలి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ యడియూరప్ప ముఖ్యమంత్రి కాలంలో అనేక పథకాలు అమలు చేశారన్నారు. సండూరులో ఇంత కాలం ఉన్న ఎమ్మెల్యే ఏ అభివృద్ధి చేశారో చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.




రోడ్‌షోలో మాట్లాడుతున్న యడియూరప్ప

మత్తెక్కిస్తున్నారు..!



● ఉప ఎన్నికల వేళ పారుతున్న మద్యం
● విచ్చలవిడిగా మందు, మనీ పంపకాలు
● నిబంధనలకు నీళ్లొదులుతున్న నేతలు

బళ్లారి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల పోలింగ్‌కు ఇక మూడు రోజులే మిగిలింది. అప్పుడే పంపకాలు జోరందుకున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న సండూరులో మద్యం, మనీ పంపకాలు అప్పుడే మొదలయ్యాయి. సండూరు ఉప ఎన్నికల వేళ గ్రామాల్లో మందు ఏరులై పారుతోంది. బుద్ధిగా ఉండే బిడ్డలు, భర్తలు ఎన్నికల వేళ స్వార్థ నేతలు పంపిన మద్యం బాటిళ్లకు బానిసలై పోతున్నారని గ్రామాల్లో మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రాజకీయంలో బళ్లారి ప్రత్యేకం, అందులోనూ సండూరు అంటే మరీ స్పెషల్ ఇలాంటి సెంటర్‌లో ఉప ఎన్నికలు జరుగుతండడం రెండు ప్రధాన పార్టీల నాయకులూ గెలుపు కోసం సర్వశక్తులూ వడ్డుతున్నారు. అందులో ప్రధానంగా డబ్బు, మద్యం ఎర వేసి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఈనెల 13 న ఓటింగ్‌కు అంతా సిద్ధమయ్యింది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మద్యం బాటిళ్లను రాజకీయ పార్టీలు భారీగా తరలిస్తున్నారు. గ్రామంలో 5 లేదా 6 విభాగాలుగా ఏర్పాటు చేసుకుని అక్కడ దగ్గరలో ఉండే వారికి మద్యం బాటిళ్లు అందిస్తున్నారు. ఇలా రెండు ప్రధాన రాజకీయ పార్టీలూ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. మద్యంతో పాటు ఇంటికో కోడి, రెండు కేజీల చికెన్, మసాలకు రూ. 1000 కూడా ఇస్తున్నారని తెలిసింది. ఇక మద్యం, మాసం తినని వారికి స్వీట్ ప్యాకెట్ గిఫ్టు ఇస్తున్నారని తెలుస్తుంది. అయితే విచ్చలవిడి మద్యం పంపకాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సండూరులో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి అతిగా మద్యం తాగి మృతి చెందాడు. అయితే దీన్ని హర్ట్ ప్రాబ్లం అని సరిచెప్పి ముగించారు. ఇలా ప్రతి గ్రామంలోనూ మద్యం విచ్చల విడిగా సరఫరా చేస్తున్నారు. అబ్కారీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పార్టీ నేతలు రెచ్చిపోతున్నారు. అక మద్యం అమ్మకాలు కూడా పరిమితికి మించి అమ్ముడుపోతున్నా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఎన్నికల నిబంధనలు తుంగలోకి తొక్కుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు..అయితే ప్రధానంగా జనంలో మార్పురావాలి.. ఓటరు డబ్బులు, మద్యం, ఇతర వస్తువులకు ఆకర్షణ కాకూదని ఎన్నికల అధికారులు, సంఘ సంస్థల ప్రతినిధులు అంటున్నారు. అయితే అంతటి మార్పు ఎవ్వరిలోనూ కనబడడం లేదు. ఆరోగ్యం కోసమైనా మందుబాబులు జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్వీకరించి చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు.



అవినాశ్ నిర్వహిస్తున్న హోటల్

చికిత్సలు చేయించడానికి వృద్ధుడిని ఆసుపత్రికి తెచ్చిన అవినాశ్

గుంతకల్లు పట్టణంలో బజ్జీల దుకాణం నడిపే కే అవినాశ్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ ద్వారా దూసుకుపోతున్నాడు. తన రీల్స్ ద్వారా అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు పొందాడు. నాలుగు నెలల్లోనే 22 వేల మంది ఫాలోయర్స్‌ను సమకూర్చుకున్నాడు. స్థానికంగా చానల్‌కు గుర్తింపు రావడంతో యాడ్ ప్రమోషన్స్ వెతుక్కుంటూ వచ్చాయి. స్థానిక వ్యాపారాలను తన ఇన్‌స్టాగ్రాం చానల్‌లో ప్రమోట్ చేస్తూ ఒక నిమిషం వీడియోకు రూ. వెయ్యి నుంచి రూ. 1,500ల వరకూ ఆదాయం పొందుతున్నాడు. ఇలా వచ్చిన డబ్బును స్నేహితులతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాడు. ఇతడి అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు కల్పించిన ఆటంకాలను అధిగమించి విజయవంతంగా ముందుకు దూసుకుపోతున్నాడు.

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు


ఇన్‌స్టాగ్రాంలో వీడియోలతో గుర్తింపు

ఇన్‌స్టాంట్ సెలబ్రిటీ..!



హోటల్‌ను నిర్వహిస్తున్న అవినాశ్

- రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌తో ఫేం
- పెరుగుతున్న యాడ్ ప్రమోషన్, రెవెన్యూ
- వచ్చిన డబ్బుతో సామాజిక సేవా కార్యక్రమాలు
- రియల్‌స్టార్‌గా మారిన గుంతకల్లు యువకుడు



ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్ హోం పేజ్

స్థానిక ధర్మవరం గేటు పక్కన బజ్జీల షాపును నిర్వహిస్తున్న అవినాశ్ పదో తరగతి వరకు చదువుకున్నాడు. సినిమా థియేటర్లలోని క్యాంటీన్లలో పనిచేస్తూ నటన పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. 2018లోనే షార్ట్ ఫిలింస్ రూపొందించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడం ప్రారంభించాడు. కానీ పెద్దగా ఆదరణ పొందలేదు. అయినా అడపాదడపా యూట్యూబ్‌లో రీల్స్ చేసేవాడు. ఈక్రమంలోనే ఈ సంవత్సరం జూలైలో ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌ను

రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌తో..

ప్రారంభించి రీల్స్ చేయడం ప్రారంభించాడు. అతి తక్కువ కాలంలోనే ఫాలోయర్స్ భారీగా పెరిగారు. నాలుగు నెలల్లోనే 22 వేల పైచిలుకు ఫాలోయర్స్‌ను కూడగట్టుకున్నాడు. ఇతడు అప్‌లోడ్ చేసిన పలు వీడియోలు మిలియన్ వ్యూస్ దాటి ఆదరణ పొందాయి. ఏ వీడియో అప్‌లోడ్ చేసినా సగటున 40 వేల వ్యూస్ వస్తుండటంతో తమ షాపు, వ్యాపారాల ప్రమోషన్ చేయాలంటూ ఇతడికి అభ్యర్థనలు ప్రారంభమయ్యా యి. ప్రస్తుతం ప్రతి రోజూ కనీసం రెండు, మూడు యాడ్ ప్రమోషన్ చేస్తున్నాడు. నాలుగు నెలల్లోనే దాదాపు 400 యాడ్ ప్రమోషన్స్ చేశానని ఇతడు తెలియజేశాడు.

ఇన్‌స్టాగ్రాంలో చానల్ మోనిటైజేషన్‌కు దరఖాస్తు చేసుకోకమునుపే యాడ్ ప్రమోషన్ ద్వారా డబ్బు వస్తుండటంతో అవినాశ్ వృద్ధులు, అనాథలకు సేవా కార్యక్రమాలు ప్రారంభించాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యాచకుడికి గాయమై చాలా దుర్భర స్థితిలో రైల్వే ఏరియాలో పడి ఉండగా స్నేహితుల సాయంతో అనంతపురం తీసు

ఇన్‌స్టా ఆదాయంతో సేవా కార్యక్రమాలు

కెళ్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించాడు. మరలా గుంతకల్లుకు తెచ్చి ఇక్కడి ఆసుపత్రిలో రెండు, మూడు రోజులకోసారి డ్రెస్సింగ్ చేయిస్తున్నాడు. ఆ కార్యక్రమాలను కూడా రీల్స్‌గా చేయడంతో సామాజిక సేవా కార్యక్రమాలకు కొందరు సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా కూడా ఇతడికి ప్రజాదరణ లభించి, చానల్ వేగంగా వృద్ధిలోకి వచ్చింది.

చానల్ హ్యాక్

అతి తక్కువ కాలంలోనే చానల్ వృద్ధి చెందడం, ప్రజాదరణ పొందడాన్ని చూసి ఓర్వలేని కొందరు తన వీడియోలకు దుర్భాషలతో కామెంట్స్ పెట్టారని అవినాశ్ ఆవేదనను వ్యక్తంచేశాడు. కొందరు ఫాలోయర్స్ తనకు మద్దతుగా కామెంట్స్ పెడితే వారి కుటుంబ సభ్యులను కూడా తిడుతూ పోస్టులు పెట్టి వేధించారన్నాడు. నెలన్నర కిందట తన చానల్‌ను హ్యాక్‌చేసి దాదాపు 70 వీడియోలను డిలీట్ చేశారన్నాడు. చానల్‌లో 20 రోజుల పాటు తాను వీడియోలను అప్‌లోడ్ చేయలేకపోయానని అవినాశ్ తెలిపాడు. తన చానల్ హ్యాక్ అయ్యిందని తెలుసుకున్న ఓ టెకీ అయిన ఫాలోయర్ గుంతకల్లుకు వచ్చి, తన చానల్‌ను రికవరీ చేసి ఇచ్చాడన్నాడు. దుర్భాషలాడుతున్న వ్యక్తులు స్థానికులని తెలిసి పోలీసులకు ఫిర్యాదుచేస్తే వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారని వెల్లడించారు. తర్వాత చానల్‌లో దుర్భాషలు ఆగిపోయాయని అవినాశ్ తెలిపాడు. త్వరలో తన ఇన్‌స్టాగాం చానల్ మోనిటైజేషన్ అవుతుందని, ఇవే రీల్స్‌ను యూట్యూబ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలలో కూడా పోస్ట్ చేస్తానని అవినాశ్ తెలిపాడు.



రీల్స్ ఆఫ్ గుంతకల్లు చానల్‌లో అవినాశ్ చేసిన రీల్స్

ముగ్గురు గురువులకు రాష్ట్రస్థాయి పురస్కారం

ఇద్దరు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లకు, ఉర్దూ ఎస్‌జీటీకి

11న సీఎం చేతుల మీదుగా అవార్డు



రమేష్‌బాబు



మహమ్మద్ యాకూబ్

అనంతపురం విద్య, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముగ్గురిని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వరించాయి. ఇందులో అనంతపురం కార్పొరేషన్ పరిధిలోని శ్రీ పొట్టిశ్రీరాములు మున్సిపల్ స్కూల్‌లో పని చేసిన ఇం గ్లిష్ టీచర్ పొలమడ రమేష్‌బాబు, ఆత్మకూరు జడ్పీహైస్కూల్ ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ గండబత్తుల సుజాత, ఉర్దూ ఎస్‌జీటీ మహమ్మద్ యాకూబ్ ఉన్నారు. వీరు ఈ నెల 11న విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.



రాష్ట్ర స్థాయిలో జరిగిన ట్రైనింగ్‌లో యాకూబ్

ఉర్దూ సేవలో టీచర్ యాకూబ్

బెస్ట్ ఉర్దూ టీచర్‌గా ఎంపికైన మహమ్మద్ యాకూబ్ 2012 డీఎస్సీలో ఉద్యోగం పొందారు. తొలిగా లేపాక్షి ఎంపీపీ ఉర్దూ బాలికల పాఠశాలలో ఉర్దూ ఎస్‌జీటీగా విధుల్లో చేశారు. తర్వాత బదిలీల్లో భాగంగా 2021లో ఎస్పీకుంట మండలం పెడబల్లి స్కూల్‌కు వచ్చారు. తాను పనిచేసిన స్కూళ్లలో ఉర్దూ భాషాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తూ వచ్చారు. అనంతరం 2023లో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో గార్లదిన్నె మండలం పీడబ్ల్యూడీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌కు ఎస్‌జీటీ ఉర్దూ టీచర్‌గా వచ్చారు. సుమారు ఏడాదిగా అక్కడే పనిచేస్తున్నారు. 2017లో 'హజ్ అసిస్టెంట్'గా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయగా హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు మక్కాలో ఉండి సుమారు రెండున్నర నెలలు సహాయ సహకారాలు అందించారు. 2021 నుంచి అమల్లోకి వచ్చిన 1వ తరగతి ఉర్దూ పుస్తకం రచయితగా వ్యవహరిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ, స్టేట్ సమగ్రశిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో పలు చోట్ల స్టేట్ రిసోర్స్‌పర్సన్‌గా పనిచేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలుశిక్షణా కార్యక్రమాల్లో భాగస్వామిగా మారి ఉర్దూ టీచర్లకు శిక్షణ అందించారు.

చాలా ఆనందంగా ఉంది

ఉర్దూ భాషకు సేవలు అందించినందుకు ఏపీ ఉర్దూ అకాడమీ నుంచి స్టేట్ బెస్ట్ ఉర్దూ టీచర్‌గా అవార్డు రావడం ఆనందంగా ఉంది. గతంలో నేను ఏనాడూ అవార్డు కోసం దరఖాస్తు చేయలేదు. నా వంతుగా ఉర్దూ భాష కోసం కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నా. ఈ ఏడాది తొలిసారి దరఖాస్తు చేశా. అవార్డు రావడం ఆనందంగా ఉంది.

- మహమ్మద్ యాకూబ్

విభిన్న బోధనా పద్ధతుల కంచుకంఠం రమేష్‌బాబు



ప్రధానోపాధ్యాయుల ట్రైనింగ్‌లో రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్న రమేష్‌బాబు

పొలమడ రమేష్‌బాబు అనంతపురం కార్పొరేషన్ స్కూళ్లలో పరిచయం అక్కరలేనివ్యక్తి. టీచర్‌గా ఎంతగా ప్రాచుర్యం పొందారో...అదే స్థాయిలో పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా తన కంచుకంఠంతో గుర్తింపు పొందారు. 1989లో ఎస్‌జీటీగా ఎంపికై, యల్లనూరు మండలం లింగారెడ్డిపల్లిలో తొలిపోస్టింగ్ పొందారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందారు. 35 ఏళ్ల సర్వీసులో విభిన్న బోధనా పద్ధతులతో విద్యార్థులకు సులువుగా అర్థం అయ్యేలా పాఠాలు బోధించారు. ఈయన ఇంగ్లిష్ భాషపై రాష్ట్ర, జిల్లా స్థాయి శిక్షకులుగా పనిచేశారు. ఎంఈఓ, డైట్ కాలేజ్ అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయుల శిక్షణ, సచివాలయ ఉద్యోగుల శిక్షణ ఇలా అనేక కార్యక్రమాల్లో ఉత్తమ శిక్షకుడిగా సేవలందించారు. పదో తరగతి నమూనా పత్రాల ముద్రణ, డీసీఈబీ ద్వారా టెన్త్ విద్యార్థులకు అందించే అనంత సంకల్పం పుస్తకాల రూపకల్పనలో ఇంగ్లిష్ పాఠ్యాంశాలపై తనదైన ముద్ర వేశారు. జిల్లాలో మూడుసార్లు కలెక్టర్ నుంచి, ఒక సారి డీఈఓ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.

చిత్తశుద్ధితో పనిచేసినందుకే..

నేను 1989 నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా. నిజాయతీ, చిత్తశుద్ధి, అంకితభావంతో పిల్లలకు బోధించా. నా సేవ, ప్రతిభను గుర్తించి ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇచ్చినందుకు సంతోషంగా ఉంది. నా ఉపాధ్యాయ వృత్తి ప్రయాణంలో నా సతీమణి, తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది ఇచ్చిన సహకారం మరువలేనిది. నాకు శక్తి ఉన్నంత వరకూ ఒక గురువుగా సమాజానికి సేవలు అందిస్తూనే ఉంటా. - రమేష్‌బాబు

కొండ నాలుకకు మందేస్తే..!

- తెగులు నివారణకు రసాయన మందు పిచికారీ
- మొత్తం ఎండిపోయిన బీర పంట
- ఎరువుల దుకాణం నిర్వాహకుడి సూచనతోనే...
- తీవ్రంగా నష్టపోయామంటున్న కక్కలపల్లి రైతులు





దెబ్బతిన్న బీర తోట, ఎండిపోయిన విధంగా మారిపోయిన బీర ఆకులు

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పంటకు తెగులు సోకిందని పురుగు మందులు పిచికారీ చేస్తే ఉన్న పంట మొత్తం దెబ్బతిని రైతులు లబోదిబోమంటున్నారు. రూరల్ మండలంలోని కక్కలపల్లి గ్రామానికి చెందిన రైతుల విషయంలోను ఇదే జరిగింది. పురుగు మందుల దుకాణం యాజమానుల నిర్వాకంతో తమకు నష్టం జరిగిందని వారు ఆరోపిస్తున్నారు.

రూ.లక్షల పెట్టుబడి నాశనం



దెబ్బతిన్న పంటను చూపుతున్న రైతు శేఖర్‌రెడ్డి

మండలంలోని కక్కలపల్లి గ్రామానికి చెందిన రైతులు శేఖర్‌రెడ్డి, రాజేంద్ర గ్రామ సమీపంలో రెండున్నర ఎకరాల్లో నెల రోజుల కిందట బీర పంట సాగు చేశారు. ఇప్పటి వరకు దాదాపు రూ.2.7లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం పంట పిందె, కాయదశలో ఉంది. అన్ని సవ్యంగా జరిగి ఉంటే ఇప్పటికి పంట కొంత కోత పడేది. అయితే పంటలో తెగుళ్ల కనిపించడం వాటి నివారణ కోసం ఈ నెల 4న రుద్రంపేట సమీపంలోని ఓ ఎరువుల దుకాణంలో పురుగు మందులు కొనుగోలు చేసి పిచికారీ చేశారు. ఆ మరుసటి రోజు నుంచే బీర తీగ ఆకులు వాడి ఎండిపోవడం ప్రారంభమైంది. బీర పిందెల పరిస్థితి కూడా ఇలాగే ఉండటంతో ఆందోళన చెందిన రైతులు తాము పురుగుమందులు కొనుగోలు చేసిన దుకాణం వద్దకు వెళ్లారు. నిర్వాహకుడికి విషయం వివరించారు. దీంతో ఆయన తోటను పరిశీలించాడు. మందు మోతాదు ఎక్కువైంది. ఏంకాదు అని చెప్పివెళ్లిపోయాడు. అయితే రోజురోజుకు పంట మరింతగా దెబ్బతింది. ఎరువుల దుకాణ నిర్వాహకుడి కారణంగానే తమకు ఈ పరిస్థితి దాపురించిందంటూ ఆ ఇద్దరు రైతులు వాపోతున్నారు.

ముంచిన ఎరువుల దుకాణం నిర్వహకుడి సూచనలు



కాపుకొచ్చిన బీర కాయలను చూపుతున్నరైతు రాజేంద్ర

ఎరువుల దుకాణం నిర్వహకుడి సూచనలే తమను ముంచాయని రైతులు చెబుతున్నారు. వాస్తవానికి దుకాణం నిర్వహకుడు ఇచ్చిన పురుగు మందులు దాదాపు వెయ్యి లీటర్ల నీటిలో కలిపి కొట్టాలని పంట పరిస్థితిని చూసిన వారు అంటున్నారు. అయితే 450లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని దుకాణం నిర్వాహకుడు చెప్పడం.. ఆమేరకు తాము మందు పిచికారి చేయడంతో తమకు ఈ పరిస్థితి ఎదురైందని వాపోయారు. మందుల్లో కాపర్ శాతం ఎక్కువగా ఉండటంతో పంట దెబ్బతినట్లు తెలిపారు. మందు పిచికారీ చేసిన తరువాత ఎండిపోతున్న పంటకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టి ఉంటే ఇప్పుడీ పరిస్థితి ఉండేది కాదని ఆ రైతులు వాపోతున్నారు. అధికారులు తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

జేఎన్‌టీయూలో ముగ్గురు బెస్ట్ ప్రొఫెసర్స్

బెస్ట్ ప్రొఫెసర్లుగా ఎంపికైన వైశాలి గోర్పడే, చెన్నారెడ్డి, బెహర దిలీప్ కుమార్







అనంతపురం సెంట్రల్, నవబంబరు 9 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బెస్ట్ ప్రొఫెసర్లుగా ముగ్గురు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అవార్డుల జాబితాను శనివారం ప్రకటించింది. జనరల్ పబ్లికేషన్స్, ప్రాజెక్టులు, పేటెంట్లు, అవార్డులు ఇలా 22 అంశాల్లో ప్రతిభ కల్గిన ప్రొఫెసర్లను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అవార్డులను అందజేస్తుంది. ఇందులో భాగంగా జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వైశాలి గోర్పడే, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ బెహర దిలీప్ కుమార్ ఉత్తమ అవార్డులకు ఎంపియ్యారు. వీరిని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, ఓస్‌డీటూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్యతో పాలు పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ఇక నుంచి మూడు రోజులు

మంగళ, గురు, శుక్రవారాల్లో పింఛన్లకు మెడికల్ సర్టిఫికెట్లు

అనంతపురం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్లను ఇక నుంచి వారానికి మూడురోజులు జారీ చేస్తామని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వ రరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఇంతకుమునుపు వారంలో రెండు రోజులు మాత్రమే సర్టిఫికెట్లు ఇచ్చేవారన్నారు. అయితే అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలకు చెందిన వారందరికి ఇక్కడే సరిఫికెట్లు ఇస్తుండటంతో రద్దీ పెరిగిందన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఇకనుంచి వారంలో మంగళ, గురు, శుక్రవారాల్లో డాక్టర్లు పింఛన్ కోసం అర్హులను పరిశీలిస్తారన్నారు.

ఈ రోగాలు ఉన్నవారికే...

తలసేమియా, సికిల్‌సెల్‌అనీమియా, హిమోఫిలియా, పక్షవాతంతో బాధ పడుతూ కుర్చీకే పరిమితమైనవారికి, కండరాల బలహీనత, వెన్నెముక బాధితులు చక్రాలకుర్చీ లేదా మంచాలకే పరిమితమైనోళ్లకు, దీర్ఘకాలికంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వారికి, కాలేయం, గుండెమార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్నవారిని ఆమూడు రోజులు సంబంధిత డాక్టర్లు పరిశీలించి నిర్ధారిస్తారన్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆయా వ్యాధులకు సంబంధించిన బాధితులకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని అక్కడే ఆయా డాక్టర్లు వైద్యపరీక్షలు, వ్యాధి ఆపరేషన్ల సర్టిఫికెట్లు పరిశీలిస్తారన్నారు. ఆయా రోజులలో ఉదయం 9గంటల నుంచి 1గంట వరకు రిజిస్ట్రేషన్, మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు డాక్టర్లు పరీశీలించడం ఉంటుందన్నారు. తొమ్మిది రకాల వ్యాధులకు సంబంధించి రోజుకు వంద ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామన్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘం

జిల్లా అధ్యక్షుడి ఎంపిక



కటిక జయరాం

అనంతపురం విద్య, నవంబరు 9(ఆంధ్ర జ్యోతి): గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినట్లు కటిక జయరాం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల కిందట కడపలో యూనియన్ రాయలసీమ ప్రాంతీయ సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఇతర రాష్ట్ర కమిటీ సభ్యులు అనంతపురం జిల్లా అడ్‌హక్ కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారని ఆయన పేర్కొన్నారు. తనతో పాటు ప్రధాన కార్యదర్శిగా బొజ్జ నాయక్, ఉపాధ్యక్షులుగా కృష్ణ, కోశాధికారిగా శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీగా ఇబ్రహీం, ప్రచార కార్యదర్శి రమేష్ నాయక్, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వర్లు, వెంకటరమణప్ప, ముత్యాలమ్మ, మల్లికార్జులను ఎంపిక చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

రామాంజినమ్మది హత్యే..?

- గతనెల 18న ఆమె అదృశ్యం
- పోలీసులు అదుపులో ముగ్గురు
- ఇంటి సమీపంలోనే చెత్తకుప్ప కింద మృతదేహం
- పరిచయమున్న వ్యక్తే నిందితుల్లో ఒకడు



రామాంజినమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో అటెండర్‌గా పనిచేస్తూ గత నెల 18న కనిపించకుండా పోయిన రామాంజినమ్మ హత్యకు గురైంది. నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో నివాసముంటున్న రామాంజినమ్మ గత నెల 17న విధులకు హాజరైంది. 18న ఉదయం ఆమె హత్యకు గురైనట్లు సమాచారం. ఆమె అదృశ్యంపై తొలుత అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. నాలుగు రోజుల కిందట ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

ఉదయం చంపి...

విశ్వసనీయ సమాచారం మేరకు... రామాంజినమ్మ ఉంటున్న ఇంటి ఎదురుగా గత కొంత కాలం ఓ ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఆ నిర్మాణ పనికి వచ్చే ఓ యువకుడితో రామాంజినమ్మకు పరిచయమైంది. అది చనువుగా మారి సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆ యువకుడు మరో యువకుడితో కలిసి ఈ నెల 18న ఉదయం రామాంజినమ్మ ఇంట్లోకి వెళ్లారు. ఇద్దరూ ఆమెపై దాడి చేసినట్లు తెలిసింది. సుత్తితో కొట్టడంతో మృతి చెందింది. తర్వాత బీరువాలో ఉన్న బంగారం నగలు, రూ.40వేలు తీసుకుని వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో వచ్చి మృతదేహాన్ని బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో సీసీ కెమెరాలు పగలకొట్టారు. మృతదేహాన్ని ఆమె ఇంటి సమీపంలో ఓపెన్ ప్లేస్‌లో ఉన్న ఓ చెత్త కుప్పలో దాచిపెట్టారు. పైన రెండు బండరాళ్లు ఉంచారు. రామాంజినమ్మ అదృశ్యంపై కేసు నమోదు కావడంతో పోలీస్ బృందాలు గాలింపు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఆమె ఇంటి సమీపంలోనే దుర్వాసన రావడంతో వెతకగా రామాంజినమ్మ మృతదేహం లభించినట్లు సమాచారం.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలు

పుట్టపర్తి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్, పూర్తి చేసిన విద్యార్థులు జర్మనీలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ పరిజ్ఞానం, డిజిటల్ నైపుణ్యాలతో ప్రాథమిక పరీక్ష ఉంటుందన్నారు. బయోడేటా, విద్యార్హతలు, పాస్‌పోర్ట్, జనన ధ్రువీకరణ పత్రం, అనుభవ సర్టిఫికెట్లు, వివాహ ధ్రువీకరణ పత్రం, కొవిడ్ ఎంఎంఆర్ సర్టిఫికెట్‌జత పరచాలన్నారు. జర్మనీలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.24వేల నుంచి రూ.35వేల వరకు జీతం లభించవచ్చని, గుంటూరులో ఆరు నెలల శిక్షణ ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వీసా ఫీజు, రానుపోను విమాన టికెట్లు, సీయూఆర్‌ఏ ఆర్థిక సహకారం ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన అభ్యర్థులు కాల్ సెంటర్ 9988853335 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

విలియం హోగర్త్ (జయంతి)




ఆంగ్ల చిత్రకారుడు విలియం హోగర్త్ 1697 నవంబరు 10న లండన్‌లో జన్మించారు. ప్రింట్ మేకర్‌గా, పిక్టోరియల్ సాటిరిస్ట్‌గా, ఎడిటోరియల్ కార్టూనిస్ట్‌గా రాణించారు. ఫ్రెంచ్, ఇటాలియన్ పెయింట్‌లతో స్ఫూర్తి పొందారు. ఆయన గీసిన చిత్రాలు మోడ్రన్ మోరల్ సబ్జెక్ట్స్‌గా పేరొందాయి. అంతేకాక రాజకీయ విమర్శలను సున్నితంగా చూపారు. మూడు శతాబ్దాలు గడిచినా కారికేచరిస్ట్‌లపై తన ప్రభావాన్ని చూపారు. 1764 అక్టోబరు 26న కన్నుమూశారు.

సీపీ బ్రౌన్ (జయంతి)



తొలి తెలుగు శబ్దకోశమును పరిష్కరించి ప్రచురించిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 1798 నవంబరు 10న కోల్కత్తాలో జన్మించారు. ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన బ్రిటీష్ అధికారి. తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన ఆంగ్లేయుడు. బ్రౌన్ నిఘంటువును ఇప్పటికీ తెలుగులో ప్రామాణికంగా పరిగణిస్తారు. ఆంధ్ర భాషోద్ధారకుడిగా గౌరవించబడ్డారు. వేమన పద్యాలను సేకరించి, ప్రచురించి, ఆంగ్లంలో అనువదించి ఖండాంతర వ్యాప్తి చేశారు. ఆయన జ్ఞాపకార్థం కడపలో గ్రంథాలయం ఏర్పాటైంది. 1884 డిసెంబరు 12న కన్నుమూశారు.

దత్తోపంత్ ఠేంగడి (జయంతి)



హిందూత్వవాది, భారతీయ కార్మిక సంఘం నాయకుడు దత్తోపంత్ బాపూరావ్ ఠేంగడి 1920 నవంబరు 10న మహారాష్ట్ర రాష్ట్రం వార్ధా జిల్లా అర్వి గ్రామంలో జన్మించారు. న్యాయవాది, తత్వవేత్త అయినా ఎంతో సరళంగా జీవించి ఆదర్శంగా నిలిచారు. స్వదేశీ జాగరణ్ మంచ్, భారతీయ మజ్దూర్‌సంఘ్, భారతీయ కిసాన్‌సంఘ్‌ల వ్యవస్థాపకులు. తుదిశ్వాసవరకు ఆర్‌ఎస్‌ఎస్ పూర్తి సమయ ప్రచారక్‌గా పనిచేశారు. దేశ సామాజిక, ఆర్థిక జీవన పరిస్థితులపై తనదైనశైలిలో ముద్రవేసి భావితరాలకు మార్గదర్శకం చేశారు. 2004 అక్టోబరు 14న కన్నుమూశారు.

తెన్నేటి విశ్వనాథం (వర్ధంతి)



తెన్నేటి విశ్వనాథం 1895లో విశాఖపట్నంలో జన్మించారు. స్వాతంత్ర్య పోరాట యోధుడు, రాజకీయ నాయకుడు. స్వాతంత్ర్యోద్యమంలో ఐదుసార్లు జైలుకు వెళ్లారు. 1937లో మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యారు. రెవెన్యూ, దేవదాయ, న్యాయశాఖల మంత్రిగా వ్యవహరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటులో ప్రధానపాత్ర పోషించారు. కాఫీ బోర్డు అధ్యక్షుడిగా అరకు లోయలో కాఫీ తోటల సాగుకు ప్రాధాన్యత ఇచ్చారు. 1979 నవంబరు 10న కన్నుమూశారు. 2004లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

టీఎన్ శేషన్ (వర్ధంతి)



దేశ చీఫ్ ఎలెక్షన్ కమిషనర్‌గా 1990 నుంచి 1996 వరకు వ్యవహరించి ఎన్నికల్లో సంస్కరణలు తెచ్చిన తిరునెళ్లై నారాయణ్ అయ్యర్ శేషన్ (టీఎన్ శేషన్) 1932 డిసెంబరు 15న కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌లో జన్మించారు. ఐఏఎస్ అధికారిగా, కేబినెట్ సెక్రటరీగా, ప్లానింగ్ కమిషన్ సభ్యుడిగా వ్యవహరించారు. 2017 నవంబరు 10న చెన్నైలో కన్నుమూశారు.

రేపు మైనార్టీ వెల్ఫేర్, నేషనల్ ఎడ్యుకేషన్ డే

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం మైనార్టీ వెల్ఫేర్, నేషనల్ ఎడ్యుకేషన్ డే నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏడీ రామసుబ్బారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. క్లాక్ టవర్ వద్దనున్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహానికి సోమవారం ఉదయం 10 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం జడ్పీలోని మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన జన్మదిన వేడుకలు నిర్వహిస్తామన్నారు.

కొర్రపాడులో ఘర్షణ

బుక్కరాయసముద్రం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రపాడులో రస్తా విషయంలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఎనిమిది మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గ్రామంలో తలారీ నాగభూషణం, తలారీ పరమేశ్ మధ్య భూముల రస్తా విషయంలో వివాదం ఉంది. గతంలో గొడవల కారణంగా ఇరువర్గాలపై కేసులు నమోదు అయ్యాయి. తాజాగా మరోమారు గొడవపడ్డారు. ఇరు వర్గాలవారు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఒక వర్గానికి చెందిన తలారీ నాగభూషణం, అతని బంధువు చిన్న ఎర్రిస్వామి, అలివేలమ్మ, నాగేంద్ర, మరో వర్గానికి చెందిన తలారి పరమేశ్, అతని బంధువు ఆనంద్, మునీశ్వరీ, కార్తీక్ గాయపడ్డారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గాయపడిన వారు అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

రైతు ఆత్మహత్య

అనంతపురం క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం గుంతపల్లికి చెందిన రైతు చెన్నకోట నరసింహులు (51) శనివారం రాత్రి నగరంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు... నరసింహులు శనివారం సాయంత్రం అరవింద నగర్ బ్రిడ్జి వద్ద పడిపోయి ఉన్నాడు. ప్రభుత్వాసుపత్రికి తరలించగా...చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఊజీమాత్రలు మింగినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఐదెకరాల పొలం ఉంది. మరి కొంత భూమి కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవాడు. ఈ క్రమంలో అప్పులు చేసినట్లు సమాచారం. తాజాగా టమోట పంటలోనూ నష్టం రావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతిపక్షాల ఆరోపణలు అవాస్తవం

» ఎమ్మెల్యే నారాయణస్వామి

బంగారపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ముసుగులో రైతుల భూములను స్వాధీనం చేసుకోవడానికి కాంగ్రెస్ కుమ్మక్కు ఇస్తోందంటూ బీజేపీ-జేడీఎస్‌లు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఎమ్మెల్యే నారాయణస్వామి ఆక్రోశం వ్యక్తం చేశారు. పట్టణంలోని బూదికోటె సర్కిల్ మసీదులో శనివారం జమాతె ఇస్లాంహింద్ ఆధ్వర్యంలో 'మన ఊరు మసీదును చూద్దాం రండి' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. సమాజంలో అశాంతికి కారణమవుతున్న అంశాలతో ప్రజలలో ఉన్న మనస్పర్థలను దూరం చేసేలా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో ముస్లింలు హిందూ వ్యతిరేకులు అనేభావన దూరం చేసేలా మసీదును చూద్దాం రండి అనే కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఇతర మతాలు, కులాల వర్గాల మధ్య అభిప్రాయబేధాలను దూరం చేసేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షుడు గోవింద, పురసభ సభ్యులు ప్రశాంత్, రాజన్, సుహేల్, జమాతె ట్రస్టు అధ్యక్షుడు నిసార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి



సుబ్బారెడ్డి తదితరులకు సన్మానం

శిడ్లఘట్ట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శిడ్లఘట్ట తాలూకా విభాగం అధ్యక్షుడిగా కేఎన్ సుబ్బారెడ్డి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా ఆరోగ్యశాఖ అక్కలరెడ్డి, కార్యదర్శిగా యోగా టీచర్ కెంపేగౌడ, కోశాధికారిగా సర్వే విభాగం వసంత్ కుమార్‌లు ఎన్నికయ్యారు. పట్టణంలోని కందాయ భవన్‌లో శనివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి, కోశాధికారిగా వసంత్‌కుమార్, రాష్ట్రపరిషత్ సభ్యుడిగా నరసింహప్పలు ఎన్నికైనట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రెండుసార్లు అధ్యక్షుడిగా వ్యవహరించిన తనకు మూడోసారి అవకాశాన్ని ఏకగ్రీవంగా కల్పించడం సంతోషంగా ఉందన్నారు. సభ్యులందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విధులు నిర్వహిస్తానన్నారు. తన అవధిలో ప్రభుత్వ ఉద్యోగుల భవనం, గురు భవనం నిర్మించడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పలువురు పూలమాలలతో నూతన అధ్యక్ష, కోశాధికారులను తదితరులు ఘనంగా సత్కరించారు.

కేపీటీసీఎల్ సంఘం అధ్యక్షుడిగా బాబు

బంగారపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటక విద్యుత్ సరఫరా మండలి (కేపీటీసీఎల్) ఉద్యోగుల సంఘం ప్రాథమిక సమితి బంగారపేట ఉపవిభాగం ఎన్నికల్లో సీ బాబు బృందం ఏడు స్థానాల్లో ఘన విజయం సాధించారు. పట్టణంలోని బెస్కాం కేటీపీసీఎల్ ఉద్యోగుల సంఘం ప్రాథమిక సంఘానికి జరిగిన ఎన్నికల్లో ఎల్ ప్రసాద్, సి బాబు బృందాలు పోటీ పడ్డాయి. మొత్తం 76 మంది ఓటర్లు ఉండగా ఏడు స్థానాలకుగాను 14మంది బరిలో నిలిచారు. అంతిమంగా మెకానిక్ గ్రేడ్-2 సి బాబు బృందం 7కు ఏడుస్థానాలు గెలుపు సాధించారు. గత ఐదేళ్ల నుంచి అధికారంలో ఉన్న ఎల్ ప్రసాద్ బృందం ఓటమి చవిచూసింది. ప్రాథమిక సమితి అధ్యక్షుడిగా సి బాబు, ఉపాధ్యక్షుడిగా కె సుబ్రమణ్య, కార్యదర్శిగా సి నాగరాజ్, సహకార్యదర్శిగా మంజునాథచారి, డైరెక్టర్‌లుగా సదానంద్, వి మంజునాథ్, సురేశ్ గెలుపు సాధించారు. ఈ సందర్భంగా రమ్యా, కదిరమ్మలను నామినేటెడ్ డైరెక్టర్‌లుగా నియమించారు. నూతన అధ్యక్షుడు బాబు మాట్లాడుతూ కేపీటీసీఎల్‌లో 75కుపైగా ఉద్యోగులు ఉన్నా ఎలాంటి బేధభావం లేకుండా సామాజిక న్యాయం అందేలా చూస్తామన్నారు. గ్రామీణ, నగర ప్రదేశాల్లో విద్యుత్ సమస్యలు అధికమవుతున్నాయన్నారు. బెస్కాం ఉద్యోగుల భద్రతకు సంఘం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విజయానికి కారకులైనవారందరికీ ధన్యవాదాలన్నారు.



అధ్యక్షుడు బాబు తదితరులకు సన్మానం

రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరం చేసే కుట్ర: సీపీఐ



సమ్మేళనంలో సీపీఎం నాయకులు

బంగారపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బీజేపీయేతర పార్టీలు పాలన సాగిస్తున్న రాష్ట్రాల్లో స్వతంత్ర సంస్థలైన ఈడీ, సీబీఐ, ఐటీలను దుర్వినియోగం చేసి వాటి దాడులతో బెదరించి రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరం చేసే కుట్ర సాగుతోందని సీపీఐ తాలూకా కార్యదర్శి పి శ్రీనివాస్ ఆక్రోశం వ్యక్తం చేశారు. తాలూకా సమగ్ర అభివృద్ధి అనే ధ్యేయంతో సీపీఎం తాలూకా 24వ సమ్మేళనం శనివారం పట్టణంలోని బాలాజి కన్వెన్షన్‌హాల్‌లో జరిగింది. సమ్మేళనంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థల తరఫున ఉంటూ రైతులు, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. సీపీఎం రాష్ట్ర ప్రముఖులు కేఎస్ లక్ష్మి మాట్లా డుతూ దేశ సమైక్యత కోసం సీపీఎం పాటుపడుతోందన్నారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్నభోజనం తదితర రంగాలలో ఉన్నవారికి ప్రతినెలా వేతనాలు ఇచ్చేందుకు సమస్య ఉందన్నారు. కార్మికుల సంక్షేమనిధి వినియోగంలోనూ అవినీతి చోటు చేసుకుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గాంధీనగర్ నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి మండలి సభ్యుడు పిఆర్ సూర్యనారాయణ, అర్జునన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో మహిళాబైకర్‌ల ర్యాలీ

బెంగళూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటక పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో స్టాంపుల సేకరణ ఆసక్తికల్గిన బృందం ద్వారా మహిళా బైకర్‌ల ర్యాలీకి శ్రీకారం చుట్టారు. శనివారం నగరంలోని మ్యూజియం రోడ్డులో 14మంది మహిళా బైకర్‌లు తరలారు. వీరు పుదుచ్చేరి, తంజావూరు, రామేశ్వరం, కన్యాకుమారి, మున్నార్‌ల మీదుగా మైసూరుకు చేరుకుంటారు. 17న బెంగళూరుకు తిరిగిరానుంది. ఢిల్లీకి చెందిన పోస్టల్ మార్కెటింగ్ విభాగం డైరెక్టర్ దిశాపన్ను ర్యాలీలో భాగస్వామ్యం అయ్యారు. ఏటా వినూత్న చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పోస్టల్‌శాఖ అధికారులు తెలిపారు. బైకర్‌లు ప్రతిరాష్ట్రంలోనూ పోస్టల్‌శాఖ గురించి, దేశభక్తి గురించి అవగాహన కల్పిస్తారన్నారు.



మహిళాబైకర్‌ల బృందం ర్యాలీకి శ్రీకారం

హత్యకు కుట్ర - సుపారి నిందితుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

శిడ్లఘట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భర్తతో వివాహేతర సంబంధం కల్గిన యోగా ట్రైనర్‌ను హత్యకు కుట్ర పన్నిన మహిళ కేసును పోలీసులు ఛేదించారు. సుపారి తీసుకున్న నిందితులను దిబ్బూరహళ్ళి పోలీసులు అరెస్టు చేశారు. సుపారి ఇచ్చిన బిందు, నిందితులు సతీశ్‌కుమార్ అలియాస్ సతీశ్‌రెడ్డి, రమణ అలియాస్ మసాలా రమణ, నాగేంద్రరెడ్డి, రవిచంద్ర, ఒక మైనరును అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. మైనరును బాలమందిరానికి తరలించారు. నలుగురు నిందితుల దర్యాప్తు కొనసాగుతోంది.

ఘటన నేపథ్యమిది...

సుపారి తీసుకున్న నిందితులు యోగా టీచర్‌పై దాడి చేసి ఆమెనుంచి ఆభరణాలు లాక్కున్నారు. దీంతో తీవ్ర నొప్పితో స్పృహ కోల్పోయింది. దీంతో మృతి చెందినట్టు భావించి ఒక గుంతలో పడేసి గడ్డి కప్పి పరారయ్యారు. కొద్దిసేపటి తర్వాత స్పృహలోకి వచ్చాక గుంతలోనుంచి బయటపడింది. బంధువుల సాయంతో కోలుకున్నాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలా ఎట్టకేలకు నిందితులను అరెస్టు చేశారు.

బావిలో గల్లంతైన కూలీ మృతి

● 24 గంటలు శ్రమించిన అధికార యంత్రాంగం ● మృతదేహం వెలికితీత



రామాంజనేయులు (ఫైల్)

ధర్మవరంరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పాడైపోయిన మోటారును తీసేందుకు బావిలోకి దిగి గల్లంతైన రైతుకూలీ మృతి చెందిన సంఘటన విషాదంగా ముగిసింది. కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన రైతు కూలీ దాసరి రామాంజనేయులు (44) ధర్మవరం మండలం కట్టకిందపల్లి వద్ద పాడైపోయిన మోటర్‌ను తీసేందుకు బావిలోకి వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. బావిలో ఎక్కువగా నీరు ఉండటంతో రామాంజనేయులు ఆచూకీ లభించలేదు. రెస్క్యూ టీం, రెవిన్యూ, అగ్నిమాపక సిబ్బంది స్థానిక ప్రజల సహాయంతో ముమ్మరంగా గాలించారు. అధిక నీళ్లు ఉండటంతో మోటార్లు బిగించి బయటకు తోడారు. రాత్రి కావడంతో లైట్లు వేసి గాలించారు. అయినప్పటికీ నీళ్ల తగ్గుముఖం పట్టకపోవడంతో శనివారం ఉదయం మరిన్ని మోటార్లు తెప్పించి తోడేశారు. దాదాపు 24గంటల పాటుఅధికార యంత్రాంగం శ్రమించి బావిలో ఉన్న రామాంజనేయులు మృతదేహాన్ని బయటకు వెలికితీశారు. ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కళావతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామాంజనేయులు బావిలో పడ్డాడని తెలుసుకున్న ముక్తాపురం గ్రామస్థులతో కాక చుట్టుపక్కన గ్రామాల ప్రజలు పెద్దఎత్తున సంఘటన స్థలం వద్దకు చేరుకుని రెండురోజులుగా అక్కడే ఉన్నారు. మృతదేహాన్ని వెలికితీయడంతో కుటుంబీకులు, బంధువులతో పాటు అక్కడున్న వారు రోదనలు మిన్నంటాయి.

యుద్ధప్రాతిపదికన చర్యలు

రైతుకూలి రామాంజనేయులు బావిలో మునిగిపోయాడన్న విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చి బయటకు తీసేందుకు అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే కలెక్టర్, రాష్ట్ర రెవిన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్డీఓ మహేష్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు, ఎస్‌ఐ శ్రీనివాసులు, అగ్నిమాపక అధికారులు 24గంటల పాటు శ్రమించి రామాంజనేయులు మృతదేహాన్ని వెలికితీశారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

నాకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయి

» అభిమానుల వద్ద ఏదీ దాచను - శివరాజ్‌కుమార్

బెంగళూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కన్నడ కంఠీరవ డాక్టర్ రాజ్‌కుమార్ తనయుడు, హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్ మనసులోని మాటలు అభిమానులతో పంచుకున్నారు. నేను మనిషినే అని నాకూ ఆరోగ్య సమస్యలు ఉన్నాయని అందుకు తగిన చికిత్సలు తీసుకుంటున్నా అన్నారు. ఇటీవల భైరతి రణగల్ సినిమా ప్రమోషన్ వేళ శివరాజ్‌కుమార్ వెల్లడించారు. అభిమానులతో పలు విషయాలు పంచుకున్నారు. నా సమస్య అభిమానులకు ఎందుకు తెలియకూడదని, వారే నాకు శక్తి అన్నారు.

మంత్రి నివాసం వద్ద కారులో మంటలు

» అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



కారు ముందు భాగంలో మంటలు

చింతామణి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలోని మాళపల్లిలో మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ఇంటి సమీపాన ఖాళీ స్థలంలో ఆపిన స్కార్పియో కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. శనివారం చోటు చేసుకున్న ఘటనలో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకుని మంటలను నియంత్రించారు. బెంగళూరు దేవనహళ్ళి రిజిస్ట్రేషన్ కల్గిన కారును యజమాని సయ్యద్‌అలీంపాషా చింతామణికి చెందిన వ్యక్తికి విక్రయించారు. సదరు వాహనాన్ని కొనుగోలు చేసిన వ్యక్తి ఇంజన్‌లో వైరింగ్ సమస్య ఉన్నట్టు గుర్తించి శనివారం ఉదయం బాగు చేయించుకుని వచ్చారు. అనంతరం మంత్రి సుధాకర్ ఇంటి సమీపాన ఖాళీ స్థలంలో పార్కింగ్ చేశారు. సాయంత్రం సుమారు 5.20 గంటలకు వాహనం నుంచి పొగలు రాగా కొద్దిక్షణాల్లోనే మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. సమీపంలోనే ఉన్న ట్యాంకరు నీటితో మంటలు ఆర్పివేశారు. చింతామణి పట్టణ ఎస్సై రమేశ్, నారాయణస్వామిలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేడు తాలూకాలో విద్యుత్ కోత

శిడ్లఘట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట, చింతామణి విభాగం పరిధిలోని 66/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో త్రైమాసిక నిర్వహణ కార్యక్రమాలు చేపట్టనుండడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. ఈనెల 10న ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 5వరకు విద్యుత్‌కోత ఉంటుందని చింతామణి బెస్కాం విభాగం ప్రకటనలో తెలిపింది. తాలూకాలోని చీమంగళ, వై హుణసేహళ్ళి, కె రాగుట్టహళ్ళి, బొమ్మప్పల్లిక్రాస్, నందిగానహళ్ళి, కొడహళ్ళి, ఇరగంపల్లి, బురుడుగుంటె, మస్తానహళ్ళి, దిబ్బూరహళ్ళి, ఎం గొల్లహళ్ళి తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు



అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

బాగేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాగేపల్లి పట్టణ పోలీసులు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. తమిళనాడులోని తిరువెరుంబూర్ పట్టణకు చెందిన మదన్, ఎల్ విజయ్‌ను అరెస్టు చేశారు. పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్‌కు చెందిన అకౌంటెంట్ సిఎన్ ప్రసాద్ సెప్టెంబరు 27న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో నగలు కుదువపెట్టి రూ.4లక్షలు తీసుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా దుండగులు దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో తమిళనాడులో నిందితులు తలదాచుకున్నారనే సమాచారంతో ఈనెల 7న అరెస్టు చేశారు. రూ.3.07లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆర్ వర్ణి తెలిపారు. కేసును ఛేదించడంపై సిబ్బందిని జిల్లా ఎస్పీ కుశాల్‌చౌక్సీ అభినందించారని వివరించారు.

టమోటా కిలో రూ. 23

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయ న్నారు. కిలో సరాసరి ధర రూ. 16, కనిష్ఠ ధర రూ. 10 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.30వేలు

అనంతపురం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మా ర్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 30వేలు పలికి నట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 24వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 86 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

975 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 975 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే అవుట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 1027 క్యూసెక్కులు వెళుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.634 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,605.65
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,536	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,116	9,052
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	29.76



అలంకరణలో ఆంజనేయస్వామి

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పేట ఆంజనేయస్వామికి శనివారం కార్తీకమాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక శనివారం ప్రధాన అర్చకులు శ్యామాచార్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పాలంకరణ, కుంకుమార్చన చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

కాలువలో శిశువు మృతదేహం

రాయచూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మస్కి తాలూకా సాగర క్యాంప్ సమీపంలో సాగునీటి కాలువలో నవజాత శిశువు (మగ బిడ్డ) కనిపించింది. శనివారం కాలువ దారిగుండా వెళుతున్న రైతులు కాలువ నీటిలో శిశువు మృతదేహం ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న మస్కి ఎస్ఐ స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతి చెందిన శిశు మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

బైక్‌లపై దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



నుజ్జునుజ్జయిన బైక్‌లు

రాయచూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సెంట్రల్ బస్‌స్టేషన్ వద్ద ఆగి ఉన్న మూడు ద్విచక్ర వాహనాల పై ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. బెంగళూరు-మంత్రాలయం వెళ్లె ఆర్టీసీ బస్సు రివర్స్ తీసుకుంటుండగా ఈ ప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంతో వాహనదారులు ఆందోళనకు గురైయ్యారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

బళ్లారి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకుడు కాంద్రా సతీష్, వెంకటేష్ హేగ్డే, తదితర సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతున్నారు. వీరితో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారు. వీధులు కిటకిట లాడుతున్నాయి.



ప్రచారంలో కాంగ్రెస్ నాయకుడు కాంద్ర సతీష్

కడుపు నింపని కులవృత్తులు..!

● రెడీమేడ్ మోజులో మరుగున పడుతున్న సంప్రదాయ వస్తువులు ● ఉపాధి కోల్పోతున్న గ్రామీణ కుటుంబాలు



కుండల తయారీలో కుమ్మరి

బళ్లారి గాంధీనగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కులవృత్తికి సాటి ఏదు గువ్వలచెన్న..అనేది పురాతన సామెత.. అంటే పొట్టకూటి కోసం ఎక్కడికో పోవాల్సిన అవసరం లేదని, ఉన్నచోటే కులవృత్తిని నమ్ముకుంటే చాలని అప్పుడు నానుడి. అయితే నేటి కాలంలో పరిస్థితి మారిపోయింది. ఆధునిక పోకడలకు కాస్త, సాంకేతిక పరిజ్ఞానం తోడు కావడంతో చేతివృత్తులకు ఆదరణ తగ్గిపోయింది. వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న కుటుంబల పరిస్థితి దినదిన గండంగా తయారయ్యింది. ఒకప్పుడు వేసవి కాలం వచ్చిందంటే చాలు పేదవాడి ఫ్రిడ్జ్‌గా చెప్పుకుంటున్న మట్టికుండలకు భలే డిమాండ్ ఉండేది. కానీ నేటి పిల్లలు మట్టికుండనే మరిచిపోయారు. వాటి స్థానంలో సొగసైన జైపూర్ కుండలు రావడంతో కుమ్మరులు తయారు చేసే కుండలకు డిమాండ్ పడిపోయింది. దీపావళి పండుగైనా తమ జీవితాల్లో వెలుగులు నింపుతాయని మట్టిప్రమిధలు తయారు చేస్తే... కేరళ, తమిళనాడు లభించే ప్రమిదలపైనే ప్రజలు మక్కువ చూపడంతో సాంప్రదాయక మట్టి దీపాలు కొనుగోలు చేయడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదని పలువురు కుమ్మరులు ఆందోళన చెందుతున్నారు. వడ్రంగి వృత్తుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వ్యవసాయ సీజన్‌లు వచ్చిందంటే మడకలు, గుంటలకు తయారు చేయించేందుకు ఒకప్పుడు వడ్రండి ఇళ్ళముందు రైతులు క్యూ కట్టేవారు...ఇంటి సామగ్రి ప్రధాన వాకిళ్ళు, కిటికీలు తయారు చేయడానికి వారే దిక్కు. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయ పనిముట్లు, రెడీమేడ్, ఇంటి నిర్మాణానికి అవసరమైన సామగ్రి మార్కెట్‌లో లభిస్తుండడంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని చెప్పవచ్చు. బంగారు నగలు తాయారీలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కంసలి బతుకు కూడా దుర్భరంగా మారిందని చెప్పచ్చు. కార్పొరేట్ నగల దుకాణాలు, ఆన్‌లైన్ మార్కెట్ కారణంగా అంతా మారిపోయింది. ఇక చాకలి, టైలరింగ్ వృత్తుల సంగతి సరేసరి. ఒకప్పుడు చేనేత దుస్తులకు ఎంతో ఆదరణ ఉండేది. కానీ రంగురంగుల పవర్‌లూమ్స్ కారణంగా చేనేత కారులు పని లేక, కడుపునిండా తిండలేక ఉపాధి కోల్పోతున్నారు. ఇలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మాయలో కొన్ని దశాబ్దాల నుండి కుటుంబ వృత్తులనే నమ్ముకుని జీవినం సాగిస్తున్న వారికి ప్రత్యామ్నాయ మార్గాలు లేక... ఇబ్బంది పడుతున్నారు. ఉభయజిల్లాలో అలాంటి వారిని గుర్తించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.



వడ్రంగి పనిలో తనమునకలై...

ప్రచారానికి ఇక రెండు రోజులే..

● సీఎం సభతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం ● ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు



తోరణగల్లులో మాట్లాడుతున్న సీఎం సిద్ధరామయ్య



కుడితినిలో నిరసన చేపట్టిన రైతులతో మాట్లాడుతున్న సీఎం

తోరణగల్లు/కంప్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉప ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకుంది. రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రచారంలో జోరు పెంచారు. ఇంటింటి ప్రచారంతో ఓటర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ప్రచారంలో మాటల యుద్ధం కూడా జోరందుకుంది. శనివారం ప్రచారంలో మాట్లాడిన సీఎం సిద్దరామయ్య బీజేపీ వారికి ఎందుకు ఓటు వేయాలి అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ తుకారామ్ తరపున సండూరు ఉప ఎన్నికల్లో మెట్రిక్ విఠలాపురం, అంతపురం, సండూరు మొదలగు చోట్ల ప్రచారంలో పాల్గొంటూ గత ముఖ్యమంత్రులు అయిన యడ్యూరప్ప సదానందగౌడ మొదలగువారు రాష్ట్రానికి చేసిన మేలు ఏమీ లేదంటూ సండూరు ప్రాంతానికి చేసిన అభివృద్ధి లేదు చేసిన అభివృద్ధి ఏమీ లేదు 17 సంవత్సరాల కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, కర్ణాటక రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమీలేదు. 15వ ఆర్థిక యోజనలో కర్ణాటకలో చాలా అన్యాయం జరిగింది. ఇది అందరికీ తెలిసిన విషయం మనం కట్టే ట్యాక్స్‌లో కేవలం 15 పైసలు మాత్రమే వస్తున్నది. కాంగ్రెస్ పార్టీ అందరికీ అన్నం దొరకాలని అన్నభాగ్య, క్షీర భాగ్య, వృద్ధాప్య పింఛన్, ఆరోగ్య యోజన ఇలా ఎన్నో ప్రయోజనాలు ప్రవేశపెట్టాం కానీ బీజేపీ వారు ఏమీ చేయలేదని వారికి ఎందుకు ఓటు వేయాలో ఆలోచించండి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు రూ. 72 వేల కోట్లు రైతులకు చాలా మంది చేసింది అలాగే రాష్ట్రంలో 2017లో రూ. 50 వేలు రైతులకు అప్పును రద్దు చేశాం. మొత్తం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 854 కోట్ల రైతుల అప్పును మాఫీ చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ మంత్రి సంతోష్ లాడ్, ఎమ్మెల్యే నాగేంద్ర, ఎమ్మెల్యే లత, ఎంపీ తుకారామ్, ప్రముఖులు కేసర్ స్వామి, చిదానందప్ప, లక్ష్మన్న కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో యడియూరప్ప పర్యటన

బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతుని గెలిపించాలని మాజీ ముఖ్యమంత్రి బీవై యడ్యూరప్ప సండూరు బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతు తరపున మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప, ఎమ్మెల్యే జనార్ధన్ రెడ్డి, తారా నగర్, రాజాపురం, బన్నిహట్టి, అంతాపుర, తాళ్లూరు, తోరణగల్ మొదలగు చోట్ల ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీ గత 50 సంవత్సరాలకు పైగా సండూరు ప్రాంతంలో అధికారంలో వుందని నాలుగు సార్లు తుకారామ్ ఎమ్మెల్యేగా గెలిచినా ప్రయోజనం లేదన్నారు.

కుడితినిలో ఇంటింటి ప్రచారం

కంప్లి : రాబోయే సండూరు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణకు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖచ్చితమని కుడితిని పట్టణ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, జక్కి అంజి, వీరేంద్ర ప్రసాద్‌లు తెలిపారు. అన్నపూర్ణ గెలుపు కోసం తమ వంతుగా కుడితినిలో భారీగా ప్రచారం చేపట్టారు. శనివారం 1, 2 వార్డుల్లో ఇంటింటా ప్రచారం చేస్తూ తుకారామ్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యమంత్రి చేపట్టిన పథకాలను వివరిస్తూ ఓటును కాంగ్రెస్ పార్టీ గుర్తుకు వేయాలని కోరారు. సురేష్, ప్రతాప్, రమేష్, గౌడ, శీనప్ప, జాకీర్, మంజు పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మను గెలిపించుకుంటాం..

కంప్లి, సిద్దరామయ్య పర్యటన కార్యక్రమంలో కొత్త దరోజీలో అన్నపూర్ణమ్మ గెలుపుకు తాము ఓట్లు వేసి గెలిపించుకుంటామని మహిళలు జేజేలు పలుకుతూ నినాదాలు చేశారు. శుక్రవారం సండూరు నియోజకవర్గ ఉప ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నపూర్ణ ప్రచారం కోసం ఏకుబెంచి, దరోజీ, కుడితినిలో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిద్దరామయ్య మాట్లాడుతుండగానే మహిళలు అన్నపూర్ణమ్మను గెలిపించుకుంటామని చేతులు ఎత్తారు. అనంతరం కుడితిని వద్ద 699 రోజులకు పైగా ఎన్ఎండీసీ, ఉత్తమ గాల్వ, అసరత్ మిట్టల్ ఫ్యాక్టరీల కోసం భూములు పోగొట్టుకున్న రైతులు న్యాయపోరాటం చేస్తున్న విషయం తెలుసుకుని అక్కడకు చేరుకుని అక్కడి రైతు నాయకులు బసవరాజు, సత్తిబాబు, తిప్పేస్వామి, జంగ్లిసాబ్, గ్రామాల రైతులతో మాట్లాడుతూ బెల్గామ్ సమావేశాల్లో ఈ విషయం గురించి తెలిపారని, ఎన్నికలు పూర్తయిన తరువాత ఫ్యాక్టరీ యాజమాన్యాలతో చర్చించి రైతులకు న్యాయం చేకూర్చుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి ..



కుడితిని పట్టణంలో బుడుగ జంగమ కాలనీ, నేతాజీ కాలనీ మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతప్ప గెలుపు కోసం కుడితిని పట్టణంలో కౌన్సిలర్ దుగ్గప్ప, సూరి, సంపత్ ఆధ్వర్యంలో జోరుగా ప్రచారం చేపట్టారు.

విరక్తి మఠాన్ని సందర్శించిన సీఎం

బళ్లారి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) సండూరులోని విరక్తి మఠాన్ని సీఎం సిద్ధరామయ్య సందర్శంచారు. అక్కడ బసవణ్ణ విగ్రహానికి పుష్పమాల వేసి దర్శించుకున్నారు. మఠాధిపతులు సీఎంకు పుత్తడి విగ్రహం అందించి ఘనంగా సన్మానించారు. మంత్రి సంతోష్ లాడ్, మునియప్ప, ఎంపీ తుకారాం ఉన్నారు.



సీఎంను సత్కరిస్తున్న మఠాధిపతులు

పేదలను ఆదుకునే పాండురంగడు

● 78 ఏళ్ల లోనూ 28 ఏళ్ల యువకుడిలా పనిచేస్తున్నారు..
● సీఎం సిద్దరామయ్యపై మంత్రి సంతోష్ లాడ్ ప్రశంసలు



మాట్లాడుతున్న మంత్రి సంతోష్ లాడ్, పక్కన అభ్యర్థి అన్నపూర్ణ

బళ్లారి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేదలను అదుకునేందుకు వచ్చిన పాండురంగుడు అని, ఆయనకు పేదలను ఆదుకోవాలనే ధ్యాస తప్పా మరేమీ లేదని కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ ప్రశంసించారు. 78 ఏళ్ల వయస్సు లోనూ 28 ఏళ్ల యువకుడిలా రోజూ 12-నుంచి 14 గంటలు పనిచేస్తున్నారు. ఆయన మనందరికీ ఆదర్శం అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్-లాడ్ అన్నారు. సండూరు ఉప ఎన్నికల నేపప్రచారంలో మంత్రి శనివారం వివిధ గ్రామాల్లో పర్యటించారు. బీజేపీ పాలనలో బళ్లారి జిల్లా నుంచి శ్రీరాములు, గాలి జనార్ధన్‌రెడ్డి, గాలి కరుణాకర్‌రెడ్డి, ఎంపీగా శాంత సండూరు అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలన్నారు. సండూరు ప్రజలు సౌమ్యులు, ఇక్కడ వాతావరణ ప్రశాంతంగా ఉంది. దీన్ని చెడుగొట్టేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని, ప్రజలు దీనిని గమనించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ గెలుపు ఖాయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఎంపీ, మంత్రి ఇక్కడే ఉన్నాము, ఖచ్చితంగా ఎమ్మెల్యేని కూడా ప్రజలు గెలిపించుకోవాలన్నారు. అభివృద్ధితో పాటు సండూరు ఉండాలంటే కాంగ్రెస్‌నే గెలిపించాలన్నారు.

కనకదాస జయంతిపై సమావేశం

సిరుగుప్ప, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కనకదాస జయంతి నిర్వహణపై అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. శనివారం జరిగిన సమావేశంలో తహసీల్దార్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఈనెల 18న కనకదాసు జయంతిని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. హైస్కూలు గ్రౌండ్ నుంచి తాలుకా పంచాయతీ ఆవరణం వరకు కనకదాసు చిత్రపటంతో భారీ ఊరేగింపు కొనసాగుతుందన్నారు. కళాకారుల ప్రదర్శనలుంటాయన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, వివిధ సంఘాల పదాధికారులు, కళాకారులు, సాహితీ వేత్తలు పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా తాలుకా పంచాయతీ ఈఓ పవన్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ గాదెలింగప్ప, కురుబ సమాజం ప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి కల్యాణోత్సవం



పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

రాయచూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ విద్యాసంస్థ నవోదయలో మూడు రోజుల పాటు సాగిన శ్రీనివాస కల్యాణోత్సవం శనివారం ముగిసింది. తిరుమల-తిరుపతి దేవస్థానానికి చెందిన అర్చకుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగిన ధార్మిక కార్యక్రమాలను తిలకించేందుకు నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. చివరి రోజు కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన పుష్పయాగం ప్రత్యేక ఆకర్శణగా నిలిచింది. వివిధ రకాల పుష్పాలను సేకరించి స్వామివారికి చేపట్టిన పుష్పయాగం అత్యంత వైభవంగా కనుల పండువగా సాగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవంలో నవోదయ విద్యా సంస్థ చైర్మన్ ఎస్.ఆర్.రెడ్డి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

లాభాలతో బంతిపూల రైతు హర్షం



విరగపూసిన బంతిపూలు

కంప్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని కృష్ణానగర్ క్యాంపుకు చెందిన నాని అనే రైతు తనకున్న ఎకరా పొలంలో బంతిపూలను సాగు చేశాడు. అయితే అధిక లాభాలతో రైతు హర్షం వ్యక్తం చేస్తున్నాడు. సుమారు ఎకరాకు రూ. 70 వేలు వరకు పెట్టుబడి అయ్యింది. బంతిపూల పంట దసరా, దీపావళిలో అనుకున్న స్థాయి కన్నా అధిక దిగుబడి రావడం...రెట్టింపు ఆదాయం చేతికందడంతో రైతు అనందం వ్యక్తం చేస్తున్నాడు. ఇతర పంటలతో పోల్చితే ఈ పంటలు తక్కువ నీరున్నా తక్కువ ఖర్చుతో పంటను సాగు చేయవచ్చునన్నారు. అధిక దిగుబడులు కూడా సాధించవచ్చునని నానీ సూచిస్తున్నాడు. మందులకు కూడా ఎక్కువగా ఖర్చు కాదని, రైతులు ధైర్యంగా సాగు చేయవచ్చంటున్నారు. అందువల్ల ప్రతి యేడాది దసరా, దీపావళి పండుగలకు ముందు బంతిపూల పంట వేసుకుంటున్నామని తెలిపారు. తమకు తోటగారి శాఖ అధికారులు కూడా స్పందించి తమకు ఎన్నో సహకారాలు అందిస్తున్నారు. మున్ముందు ఈ బంతిపూల పంటను వేసుకునేందుకు రైతన్నలు మొగ్గుచూపుతున్నారన్నారు.

హోసూరు జోన్

డెంకణికోట అడవుల్లో వందకుపైగా ఏనుగులు

● పంటల దిగుబడిపై ఆందోళనలో రైతులు

హోసూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో ఏనుగుల బెడద పెరిగిందని రైతులు వాపోతున్నారు. హోసూరు, బాగలూరు, శూలగిరి, ఉద్దన్నపల్లి, డెంకణీకోట, అంచెట్టి, ఉరిగం, బెట్టముగిలాళం, తదితర ప్రాంతాల్లోని సాగుభూమి ఉంది. వర్షాధార పంటలైన జీడి, నువ్వులు, సామ, వేరుశనగ, తదితర పంటలను సాగు చేస్తున్నారు. ప్రధానంగా 80 శాతం పంట ఇక్కడే సాగు అవుతుంది. దిగుబడికి వచ్చిన పంటను వ్యాపారులు నేరుగా పొలాలకు చేరుకుని కొనుగోలు చేసేవారు. ఇటీవల కొంతకాలంగా సమీపంలోని అటవీప్రాంతాలనుంచి ఏనుగులు అకస్మికంగా వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. డెంకణీకోట అడవుల్లో సుమారు వందకుపైగా ఏనుగులు ఉన్నాయని వాటినుంచి పంటలను కాపాడుకోవడం సవాల్‌గా మారిందని రైతులు అభిప్రాయపడుతున్నారు. రైతు ఆదినారాయణన్ మాట్లాడుతూ 14 ఏకరాల్లో రాగులు సాగు చేస్తున్నామని 40 ఏళ్ల క్రిందట వ్యవసాయం ఎలా ఉందో ఈ ఏడాది కూడా అంతే సుభిక్షంగా ఉందన్నారు. ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తుండడంతో కొంత ప్రయోజనకరంగా ఉందన్నారు.

సేవాకార్యక్రమాలపై అవగాహన శిబిరం

హోసూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హోసూరు మత్తిగిరిలోని పాల్టీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం నేషనల్ లీగల్ సర్వీసెస్ డే శిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సెల్వన్ అధ్యక్షత వహించారు. హోసూరు సర్కిల్ లీగల్ అఫైర్స్ కమిటీ అడ్వకేట్ వెంకటేశం, లీగల్ వలంటీర్లు యాకుబు, గోపాలన్, కమలేష్‌బాబు, మోహన్‌కుమార్ పాల్గొని ఉచిత న్యాయ సలహాల గురించి విద్యార్థులకు సేవాకార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రొఫెసర్ జయంతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సెల్వన్

అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న మంత్రి చక్రపాణి తదితరులు

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి, కావేరిపట్టణం పంచాయతీల్లో రూ.2.16 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇదే సందర్భంగా 11వ తరగతి చదువుతున్న 869 మందికి రూ.41.84 విలువైన సైకిళ్లను అందించారు. 85 మంది లబ్ధిదారులకు 28.43 లక్షల సంక్షేమ సాయాన్ని అందించారు. పౌర ఆహార సరఫరాల శాఖ మంత్రి ఆర్.చక్రపాణి మాట్లాడుతూ కృష్ణగిరి, ధర్మపురి జిల్లాల ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు రూ.8 వేల కోట్లతో హొగనేకల్ ఉమ్మడి తాగునీటి ప్రాజెక్టు 11ను తమిళనాడు ముఖ్యమంత్రి ప్రారంభించబోతున్నారని తెలిపారు. శనివారం గృహనిర్మాణ ధృవీకరణ పత్రం పొందిన లబ్ధిదారులందరికి రానున్న ఆర్థిక సంవత్సరంల్లో కరుణానిధి కలల గృహం పథకం క్రింద ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. కృష్ణగిరి జిల్లాలో గత మూడేళ్లల్లో కొండగ్రామాల తోపాటు 116 చోట్ల ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ ధరల దుకాణాల తెరిచారు. కృష్ణగిరి కావేరిపట్టణం పంచాయతీలో రూ.2.16 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కమిటీ చైర్మెన్ మణిమేగళై నాగరాజ్, జిల్లా సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.పెరియస్వామి, కృష్ణగిరి దేవదాయ శాఖ కమీషనర్ షాజకాన్, ఉద్యానవన శాఖ అసోసియేట్ డైరెక్టర్ ఇందిర, జిల్లా సరఫరా అధికారిణి గీతారాణి, జిల్లా వెనుకబడిన సంక్షేమ అధికారిణి పద్మలత, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మలర్విళి పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం

హోసూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం పెరియార్ నగర్‌లో వెలసిన ప్రముఖ వేల్ మురుగన్ ఆలయంలో స్కంద షష్ఠి ఉత్సవాల ముగింపులో స్వామివారికి తిరుకల్యాణ వైభవం నిర్వహించారు. ఈనెల 2న ఉత్సవాలు ప్రారంభం కాగా సురసంహార కార్యక్రమం అనంతరం వల్లీ, దేవసేనలతో స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి వేంచేపు చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా ధార్మిక కార్యక్రమాలు కొనసాగించారు. వేలాది మంది భక్తులు భక్తి పారవశ్యంతో హరోహర, వేల్ మురుగన్‌కు హరో హరా అంటూ నినదించారు. స్వామి వారికి ప్రత్యేక దీపారాధన అనంతరం భక్తులకు ప్రసాదాలు, అన్నదానం చేశారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

హోసూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా 15 ఇళ్లు నిర్మించారు. దీంతో దేవదాయ శాఖ అధికారులు కార్యాచరణ జరిపి అక్రమ నిర్మాణాలను తొలగించారు. హోసూరు రాయకోట రోడ్డులో వకీల్ లే అవుట్ అనే రెసిడెన్షియల్ ప్రాంతానికి ఆనుకుని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్థలంల్లో 20కు పైగా ఇళ్లు అక్రమంగా నిర్మించి అద్దెకు ఇచ్చినట్లు సబ్ కలెక్టర్ ప్రియాంకకు సమాచారం అందింది. దీంతో స్థలాన్ని పరిశీలించి అనుమతిలేకుండానే నిర్మించిన ఇళ్లను తొలగించాలని ఆదేశించారు. తహశీల్దార్ చిన్నస్వామి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ నేతృత్వంలో 20 మందికి పైగా దేవదాయ శాఖ సిబ్బంది, పోలీసులు పాల్గొని పొక్లైనర్‌లతో నిర్మాణాలను తొలగించారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఎక్స్‌కవేటర్‌తో తొలగింపు పనులు